నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | వరంగల్, సోమవారం 27 జనవరి 2025 | MAHABUBABAD



రోడ్డు ప్రమాదంలో లారీ నుంచి రోడ్డుకు అడ్డంగా పడ్డ ఇనుప స్తంభాలు, వాటి మధ్యలో ఉన్న మృతదేహాలు

# బతికేందుకు వచ్చి బలై..

**కుటుంబాన్ని చిదిమేసిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యం**

- లారీ నుంచి ఆటోలపై పడిన పెద్దపెద్ద ఇనుప స్తంభాలు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దుర్మరణం, కొంతమందికి గాయాలు
- పగిలిన తలలు.. విరిగిన ఎముకలు
- కళ్లముందే కుటుంబ సభ్యుల మరణం..
- రోడ్డుపై అడ్డంగా పడిన భారీ లారీ.. ఇనుప స్తంభాలు
- తక్షణం స్పందించిన పోలీసులు.. సహకరించిన ప్రజలు



రోడ్డుపై అడ్డంగా పడిన భారీ లారీ

కరీమాబాద్, జనవరి 26 : వారంతా పొట్టకూటి కోసం ఎక్కడో సుదూర ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి బతుకుతున్నారు. పనిచేసేందుకు మరోప్రాంతానికి వెళ్తుండగా లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఆ కుటుంబాన్ని చిదిమేసింది. కళ్ల ముందే తమ కుటుంబ సభ్యుల మృతిని చూసి ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. ఇనుప స్తంభాల మధ్య ఉన్న తన భర్త.. కూతుళ్లను చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. కొనఊపిరితో ఉన్న కొడుకును తన ఒడిలో పెట్టుకొని ఆపన్న హస్తం కోసం ఎదురుచూసింది. తలలు పగిలి.. ఎముకలు విరిగి మృతదేహాలు ఛిద్రమయ్యాయి. ఈ ఘటనను చూసిన వారి హృదయాలు చలించిపోయాయి. లారీ డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లుగా తెలిసింది. వివరాల్లోకి వెళితే... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి సంతోష్, అతడి భార్య చమాభాయ్, కుమారులు ముకేశ్, కన్నా, కుమార్తెలు పూజ, కిరణ్ కొంతకాలంగా మామునూరులో కూలీ పని చేస్తూ జీవిస్తున్నారు. పొట్టకూటి కోసం తమ సామగ్రిని సర్దుకొని ఆదివారం ఆటోలో వరంగల్ వైపుగా వెళ్తున్నారు. అదేవైపుగా ఇనుప స్తంభాల లోడుతో వైజాగ్ నుంచి రాజస్థాన్‌కు ఓ భారీ లారీ వెళ్తూ మామునూరు బెటాలియన్‌కు సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. కొద్ది దూరం వరకు ముందుకు వెళ్లింది. దీంతో అందులో ఉన్న ఇనుప స్తంభాలు అదే దారిలో వెళ్తున్న 2 ఆటోలపై పడ్డాయి. దీంతో రెండు ఆటోలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో ఓ ఆటోలో 7 గురు ఉండగా మరో ఆటోలో డ్రైవర్ ఉన్నాడు. ఒక్కసారిగా ఇనుప స్తంభాలు ఆటోలపై పడడంతో అందులో ఉన్న సంతోష్ (48), పూజ (20), కిరణ్ (20) కన్నా (7) అక్కడికక్కడే మరణించగా, ముకేశ్, ఆటో డ్రైవర్లు షకీర్, సాగర్ తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న కారుకు సైతం ఇనుప స్తంభాలు తాకగా పాక్షికంగా దెబ్బతింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించి క్షతగాత్రులను ఎంజీఎం దవాఖానకు తరలించారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

**రోడ్డుపై పడ్డ ఇనుప స్తంభాలు**

ఇనుప స్తంభాలు ఆటోలతో పాటు రోడ్డుపై అడ్డంగా పడడంతో మామునూరు రహదారిపై రాకపోకలు స్తంభించాయి. క్రేన్‌లు, జేసీబీల సాయంతో డీసీపీ నుంచి కానిస్టేబుల్ వరకు దాదాపు 3 గంటల పాటు శ్రమించి ఇనుప స్తంభాలు, లారీని పక్కకు జరిపి రాకపోకలు ప్రారంభించారు. వారికి ప్రజలు సైతం సహకరించారు. ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను దారి మళ్లించారు.

**ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు..**

కలెక్టర్ సత్య శారదాదేవి, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్యాధికారి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కలెక్టర్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎంజీఎం దవాఖానకు వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందజేయాలని ఎంజీఎం అధికారులు, సిబ్బందికి సూచించారు.

**మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ**

వరంగల్‌చౌరస్తా: మృతుల కుటుంబాలను మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారదతో కలిసి ఎంజీఎం దవాఖాన మార్చురీకి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. కుటుంబాలను ఓదార్చి, ఆర్థిక సాయం అందజేశారు. క్షతగాత్రులను కలిసి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయాన్ని వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు.



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో, మంచాలు, ఇతర వస్తువులు



బీఆర్‌ఎస్ నాయకులను చితకబాదుతున్న సీఐ దామోదర్ రెడ్డి



ఎర్రకుంట తండాకు వచ్చిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

# కాంగ్రెస్ గూండాగిరి

## పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యే పల్లాపై దాడి

- కోడిగుడ్లు, టమాటాలు, రాళ్లు విసిరిన కార్యకర్తలు
- ఎర్రకుంటలో ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ పాటలతో హంగామా
- బీఆర్‌ఎస్ నాయకులపై సీఐ విచక్షణారహితంగా లాఠీచార్జి
- రాజేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేసి జనగామకు తరలింపు
- అంతకు ముందే గులాబీ శ్రేణుల నిర్బంధం
- ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో సభకు హాజరుకాని మంత్రి పొంగులేటి

జనగామ రూరల్, జనవరి26: ప్రజాపాలనలో భాగంగా జనగామ మండలంలోని ఎర్రకుంట తండాలో ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గూండాగిరి చేశారు. పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కోడిగుడ్లు, టమాటాలు, రాళ్లు విసిరారు. అంతకు ముందే గ్రామంలో ఉన్న బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసులు నిర్బంధించి ఇండ్ల నుంచి బయటకు రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. పక్క గ్రామాల వారిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముందుగా ఎమ్మెల్యే పల్లా సభ స్థలానికి చేరుకొని ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి లబ్ధిదారుడికి అందించాలని తాము కూడా కోరుకుంటున్నామని తెలిపారు. ఇంతలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పల్లా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పార్టీకి సంబంధించి పాటలు పెట్టి పోలీసుల సమక్షంలోనే డ్యాన్సులు చేశారు. దీంతో ఇది ప్రభుత్వ కార్యక్రమా లేక కాంగ్రెస్ పార్టీ సభా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కాంగ్రెస్–బీఆర్‌ఎస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు. అప్పటికే బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లపల్లి అశోక్, గుర్రం కుమార్‌లను సీఐ దామోదర్ రెడ్డి విచక్షణా రహితంగా చితక బాదడంతో తీవ్ర రక్తస్రావమైంది. కుమార్ మోకాలికి తీవ్ర గాయమైంది. ఈ క్రమంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి పర్యటన రద్దయ్యిందని ఆర్డీవో గోపీరామ్ ప్రకటించడంతో కాంగ్రెస్ నాయకులు ఆగ్రహంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కోడిగుడ్లు, రాళ్లు, టమాటాలతో దాడి చేశారు. పల్లాతో పాటు పలువురు జర్నలిస్టులు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులపై అవి పడ్డాయి. జర్నలిస్టు ఉపేందర్ కన్నుపై దెబ్బ తగలడంతో అతన్ని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, జర్న లిస్టులు పక్కకు తీసుకెళ్లారు. దీంతో పోలీసులు ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డిని బలవంతంగా అక్కడి నుంచి అరెస్టు చేసి కారులో జనగామకు తరలించారు. అనంతరం సభ నిర్వహించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రాలేదని స్థానికంగా చర్చ జరిగింది.



ఘర్షణలో గాయపడిన బీఆర్‌ఎస్ నాయకుడు

### డీజే పాటలతో కాంగ్రెస్ నాయకుల డ్యాన్సులు

సమావేశం ప్రారంభం కాకుండానే కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి పాటలతో డ్యాన్స్ లు చేయడంతో పోలీసులు కూడా వంతపాడారు. పార్టీ కార్యక్రమంలా వ్యవహరించారు. ప్రొటోకాల్ ప్రకారం తన నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో హక్కు ఎమ్మెల్యేకు ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు పార్టీ సభగా మార్చారు. ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టులు చేసి తండాలో భయభ్రాంతులు కల్పించారు.

### బీఆర్‌ఎస్ నాయకులపై దాడి

బీఆర్‌ఎస్ వెంకిర్యాల గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి అశోక్, గానుగుపహాడ్ గ్రామ మాజీ స ర్పంచ్ గుర్రం కుమార్‌ను సీఐ విపరీతంగా కొట్టాడు. ఎందుకు కొడుతున్నావని అడగడంతో మీకు ఇక్కడేం పని అని, ఎందుకొచ్చారంటూ లాఠీచార్జి చేశాడు.



జనగామ చౌరస్తా: బీఆర్‌ఎస్ నాయకులపై కోడిగుడ్లతో దాడి చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

### దాడులకు భయపడేది లేదు: ఎమ్మెల్యే పల్లా

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దాడులకు భయపడేది లేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఎర్రకుంట తండా మాజీ సర్పంచ్ గుగులోత్ మంజుల, శారద, లాఠీ దెబ్బలతో గాయపడిన వారితో కలిసి విలేకరుల సమావే శంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడితే సీఐ దామోదర్ రెడ్డి వారిని వంత పాడా రన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను గొడ్డును బాదినట్లు బాదాడని, వరంగల్ కమిషన ర్, డీజీకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. పోలీసులపై చర్యలు తీసుకోవడంతోపాటు తనపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయాలని పల్లా డిమాండ్ చేశారు. తండావాసులను ముందస్తు అరెస్టుల పేరుతో హింసించారని, కాంగ్రెస్ దురాగతానికి టీవీ–9 జర్నలిస్టు గాయపడితే, పోలీసుల లాఠీచార్జికి 22 మంది బీఆర్‌ఎస్ నాయకులకు దెబ్బలు తగిలి రక్తాలు కారాయని మండిపడ్డారు. తండాలో అర్హులకు ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులను మాత్రమే ఎంపిక చేశారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను కాదని, ఓడిపోయిన అభ్యర్థిని అందలం ఎక్కిస్తున్నారని అన్నారు.



జనగామలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



హనుమకొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా



ములుగులో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర



మహబూబాబాద్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

# త్రివర్ణ శోభితం

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు

- ఊరూరా.. వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
- జెండాలను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్లు
- స్వాతంత్య్ర సమర యోధులకు సన్మానం
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల అందజేత

*ఊరూ.. వాడా మువ్వన్నెల జెండా రెపరెపలాడి త్రివర్ణ శోభితమైంది. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. హనుమకొండలోని పోలీస్ పరేడ్ మైదానంలో కలెక్టర్ ప్రావీణ్య జాతీయ జెండాను ఎగురవేసి పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాతో కలిసి గౌరవ వందనం స్వీకరించారు. వరంగల్ ఖుష్ మహల్ మైదానంలో కలెక్టర్ సత్యశారద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానంలో కలెక్టర్ టీఎస్ దివాకర, మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో షేక్ రిజ్వాన్ బాషా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో రాహుల్ శర్మ జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆయా జిల్లాల్లో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. స్వాతంత్య్ర సమర యోధులను సన్మానించారు. ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జాతీయ సమైక్యత వెల్లివిరిసేలా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.*

*- నమస్తే నెట్‌వర్క్, జనవరి 26*



వరంగల్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ సత్యశారద



మహబూబాబాద్‌లో స్వాతంత్ర్య సమర యోధురాలిని సన్మానిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్





భూపాలపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



మహబూబాబాద్‌లో విద్యార్థుల విన్యాసం



వరంగల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు